# సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం । 8 । జనవరి । 2025






## మత్తుకు దూరంగా ఉండాలి

యువత మత్తుకు దూరంగా ఉండాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸



## రైతు మార్కెట్‌లో రగడ

హన్వాడ రైతు మార్కెట్‌లో చేపట్టిన నిర్మాణాలపై రగడ నెలకొంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /13.7

## వాతావరణం

ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత భారీగా పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### సిబ్బందికి అభినందన



**గద్వాల క్రైం: ఉత్తమ సేవలకు ఎంపికైన సిబ్బందిని మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా**డుతూ వివిధ రకాల సమస్యలపై వచ్చే ఫిర్యాదుదారులకు స్టేషన్ సిబ్బంది తమదైన శైలిలో సమస్యలు పరిష్కరిస్తూ.. పోలీస్ శాఖపై నమ్మకం కలిగించేలా కృషిచేశారన్నారు. అత్యవసర, విపత్కర సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాంతియుత వాతావరణం కల్పించారన్నారు. సిబ్బంది చేసిన సేవలకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ క్రమంలో సేవా పతకాలకు ఎంపికైన ఐదుగురు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరికి ఈ నెల 26న సేవా పతకాలు అందజేస్తామన్నారు.

### పురుగు మందు కొనుగోలు చేయవద్దు

గద్వాల వ్యవసాయం: ఫెస్టిసైడ్ టెస్టింగ్ ల్యాబ్ నివేదిక, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులను అనుసరించి అబామెక్టిక్ 1.9 శాతం, ఉఇ విత్ యాక్టివ్ ఇంగ్రిడియంట్స్ 1.57 శాతం (అబెక్స్) బ్యాచ్ నంబర్ అఅఅ2409002 గల పురుగు మందును రైతులు ఎవరూ కొనుగోలు చేయొద్దని జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ బ్రాండ్ తప్పుగా చేసినట్లు నిర్ధారణ అయ్యిందని, వ్యాపారులు ఎవరూ ఈ మందును రైతులకు అమ్మవద్దని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

### వేరుశనగ క్వింటా రూ.6,789

గద్వాల వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 1,099 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. క్వింటాల్ గరిష్ట ధర రూ.6,789, కనిష్టంగా రూ.3,899, సరాసరిగా రూ.5,690 చొప్పున వచ్చాయి. అలాగే 8 క్వింటాళ్ల ఆముదాలు రాగా క్వింటాల్ గరిష్టంగా రూ.5,530, కనిష్ఠం రూ.5,390, సరాసరిగా రూ.5,420 ధరలు లభించాయి. 90 క్వింటాళ్ల వరి (సోన) రాగా.. గరిష్టంగా రూ.2,276, కనిష్టంగా రూ.1,862, సరాసరిగా రూ.2,249 ధరలు పలికాయి. 239 క్వింటాళ్ల కంది రాగా గరిష్టంగా రూ.7,706, కనిష్టంగా రూ.3,036, సరాసరి రూ.7,469 ధరలు వచ్చాయి.

# లక్ష్యం.. శత శాతం

## 'పది'లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు



గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- ఈ రెండు నెలలు ఎంతో కీలక సమయం
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- వెనకబడిన విద్యార్థులపై దృష్టిసారించిన ఉపాధ్యాయులు
- ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తున్న జిల్లా విద్యా శాఖ

**జిల్లా పరిధిలో ఇలా..**

| | |
|---|---|
| ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 84 | కేజీబీవీలు 12 |
| బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు 14 | పది పరీక్ష రాయనున్న విద్యార్థులు 7,589 |

**గత మూడేళ్లలో పది ఫలితాలు ఇలా..**

| విద్యా సంవత్సరం | మొత్తం విద్యార్థులు | ఉత్తీర్ణులైన వారు | శాతం |
|---|---|---|---|
| 2021- 22 | 7,920 | 6,783 | 85.64 |
| 2022- 23 | 7,175 | 5,790 | 80.70 |
| 2023- 24 | 7,204 | 5,839 | 81.38 |

గద్వాల టౌన్: పరీక్ష కాలం మొదలైంది.. ఇటు తల్లిదండ్రులు.. అటు విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతోంది. పదో తరగతి వార్షిక పరీక్షలకు తేదీ ఖరారు చేయడంతో ఎక్కడికక్కడ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. మార్చి 19 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు తేదీలు ప్రకటించడంతో సరికొత్త ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించగలమని ఉపాధ్యాయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యాశాఖ శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. సిలబస్ పూర్తి చేసిన వెంటనే ఉపాధ్యాయులు పునశ్చరణ చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని మొదటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

**ప్రత్యేక తరగతులు..**

శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని ఇటీవల కలెక్టర్ సంతోష్ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభిచారు. నిత్యం మధ్యాహ్నం 3.35 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రతి విద్యార్థి వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ప్రత్యేక తరగతుల స్థానంలోనే నిత్యం రెండు పాఠ్యాంశాలకు సంబంధించి స్లిప్ టెస్టులు నిర్వహించనున్నారు. ఆరు పాఠ్యాంశాల ఉపాధ్యాయులను నియమించి ప్రత్యేక తరగతి సమయంలో అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. కేజీబీవీలు, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సైతం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

**ఈ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి**

గతంలో ఇంగ్లిష్, గణితం, సామాన్యశాస్త్రంలో చాలామంది అనుత్తీర్ణులయ్యారు. అవసరమైన ప్రయోగశాలలు, సామగ్రి అందుబాటు లేకనే ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో ఈసారి ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించారు. పాఠశాలలోని ఉన్న ప్రయోగ వనరులను సద్వినియోగం చేసుకుని సన్నద్ధత దిశగా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఉన్న ప్రశ్న పత్రాల ఆధారంగా మోడల్ పరీక్ష పత్రాలను రూపొందించి విద్యార్థులను ఉత్తేజపరుస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలపై ప్రత్యేక బోధన చేస్తూ విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే పదో తరగతిలో ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించేలా అధికారులు సూచనలు చేశారు.

**ఎక్కువ సమయం కేటాయించి**



**ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి మా ప్రశ్నలను నివృత్తి చేస్తున్నారు.** అన్ని అంశాల్లో మార్కులు రావాలంటే ఇప్పటి నుంచే సిద్ధం కావాలి. ప్రధాన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించి సాధన చేస్తున్నాం. రోజువారిగా నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే.. పరీక్షలు నిర్వహిస్తున్నారు.

– పల్లవి, పదో తరగతి, ఇర్కిచేడు

**ఎంతో ఉపయోగం..**



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల పాఠ్యాంశంపై ఉన్న సందేహాలు పూర్తిస్థాయిలో నివృత్తి అవుతున్నాయి. పూర్తిగా అవగాహన కలుగుతుంది. పది విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరం. వందశాతం ఫలితాలు సాధించడానికి ఇవి దోహదం చేస్తాయి. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– మౌనిక, పదో తరగతి, మానవపాడు

**ప్రణాళిక ప్రకారం ముందుకు..**

జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళిక ప్రకారం తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు తేదీ ఖరారు కావడంతో నిత్యం ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం.

– అబ్దుల్ ఘనీ, డీఈఓ

## జోగులాంబ సన్నిధిలో కలెక్టర్



**అలంపూర్: అలంపూర్ ఆలయాలను కలెక్టర్ బీఎం సంతోష్ మంగళవారం దర్శించుకున్నారు. కలెక్టర్‌కు ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఈఓ, అర్చకులు కలిసి కలెక్టర్‌ను శేషవస్త్రాలతో సత్కరించారు.**

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మల్దకల్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సిద్ధప్ప

మల్దకల్/ అయిజ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంతోపాటు సుఖ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది పనిచేస్తున్నారని డీఎంహెచ్ఓ సిద్ధప్ప అన్నారు. మంగళవారం మల్దకల్ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఓపీ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది గర్భిణీ, బాలింతల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలనెలా క్రమం తప్పకుండా గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించాలని, ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే అయిజలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను డీఎంహెచ్ఓ పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీలను మూడు నెలలలోపే గుర్తించి నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వరూపరాణి, కిరణ్, ప్రోగ్రాం ఆఫీసర్లు సంధ్యకిరణ్, వరలక్ష్మి, రాజు, ప్రసూనరాణి, శ్యాంసుందర్, తిరుమలరెడ్డి, డీపీహెచ్ఎన్ఓ వరలక్ష్మి, ఏఎస్ఓ తిరుమల్‌రెడ్డి, డీడీఎం రామాంజనేయులు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగులో మెళకువలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, రైతులు

ఎర్రవల్లి: మొక్కజొన్న సాగులో రైతులు సరైన మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మంజులత అన్నారు. మంగళవారం మండలంలోని పుటాన్‌దొడ్డి రైతువేదికలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఆధ్వర్యంలో యాసంగిలో సాగుచేసే మొక్కజొన్న పంటపై రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొక్కజొన్న సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్త రైతులకు, వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉండే విత్తన రకాలను మాత్రమే ఎంచుకోవాలన్నారు. విత్తనాల్లో మొలక శాతం 70 కంటే ఎక్కువగా ఉండాలన్నారు. ముఖ్యంగా విత్తన శుద్ధి చేసిన విత్తనాలను మాత్రమే కొనాలన్నారు. లేదా రైతులు సొంతంగా ఇంటి దగ్గరే విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. రైతులు రోగ నిరోధక శక్తి కలిగి అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్ రకాలు వాడాలన్నారు. బిందు, తుంపర్ల సేద్యంలో నీరు పెడితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ చేపట్టాలని, కాయలను సరైన పక్వత ఉన్నప్పుడు కోసి ఆకారం, పరిమాణం, రంగును అనుసరించి గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తరలిస్తే రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## నేటినుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెద్దదిన్నెలో వేంకటేశ్వరస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్

ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు జయసింహ మంగళవారం తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో జరిగే ఉత్సవాల మాదిరిగానే పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో బుధవారం వాస్తుహోమం, యాగశాల ప్రవేశం, గురువారం శ్రీవారి కల్యాణం, శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, శనివారం దివ్యమంగళ బ్రహ్మ రథోత్సవం, ఆదివారం పారువేట ఉత్సవం, స్వామివారి ఊరేగింపు, సోమవారం చక్రస్నానం, నాగవేళి తీర్థావళి, ధ్వజావారోహణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



గద్వాల టౌన్: ప్రతిఒక్కరూ నిత్యం పూజలు నిర్వహిస్తూ.. ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని హిందూ ధర్మం గురించి ప్రవచనం చేశారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ప్రస్తుతం హిందూ ధర్మాన్ని ఆచరించడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. హిందూ సమాజం ద్వారానే లోక కల్యాణం సిద్ధిస్తుందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారతీయ సంస్కృతి ద్వారానే సమాజంలో ప్రేమ, సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. గో సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. హిందుత్వ వికాసం జరగడానికి కృషి చేయాలన్నారు.మున్సిపల్ చైర్మన్ కేశవ్ తదితరులు పాల్గొని జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.



# భళా.. బాల శాస్త్రవేత్తలు

- అబ్బురపరిచేలా విద్యార్థుల ఆవిష్కరణలు
- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించి.. వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్చర్ల మండలం పోలేపల్లి ఎస్‌వీకేఎంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. ప్రస్తుతం సమాజంలో పలు సమస్యలకు పరిష్కారం చూపేలా బాల మేధావులు రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి.

- జడ్చర్ల/జడ్చర్ల టౌన్





### అల్ట్రాసోనిక్ హెల్మెట్

వినికిడి లోపం ఉన్నవారితో పాటు వాహనదారులందరికీ బైక్ నడిపే సమయంలో ప్రమాదాల నివారణకోసం అల్ట్రాసోనిక్ హెల్మెట్‌ను ఖమ్మం జిల్లా చెన్నారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రియ గైడ్ రామారావుతో కలసి రూపొందించారు. వాహనం నడిపేటప్పుడు సెన్సార్ల ఆధారంగా హెల్మెట్ గ్లాస్‌కు కంటికి కనిపించే విధంగా గ్రీన్, ఆరెంజ్, రెడ్ లైట్లను ఏర్పాటు చేశారు. గ్లాస్‌కు ఏర్పాటైన లైట్ల ఆధారంగా గ్రీన్ అయితే సేఫ్ జోన్‌లో వెళ్తున్నట్లు, ఆరెంజ్ లైట్ పడితే అలర్ట్‌గా ఉండాలని, రెడ్ అయితే డేంజర్ జోన్‌లో వెళ్తున్నట్లు గుర్తించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. దీని ఖర్చు కేవలం రూ.400 నుంచి రూ.1,000 వరకు అవుతుంది.

### సంజీవని హెలీకాప్టర్..



హెలీకాప్టర్ ప్రమాదంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్, ఆయన సతీమణితోపాటు పలువురు మృత్యువాతపడిన దుర్ఘటనలను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రణీత్ కుమార్ తన గైడ్ శోభారాణితో కలిసి 'సంజీవని హెలీకాప్టర్' ప్రయోగాన్ని ప్రదర్శించారు. హెలీకాప్టర్ ప్రమాదం జరిగినప్పుడు బుల్లెట్ ప్రూఫ్, ఫైర్‌ప్రూఫ్‌తో కూడిన బెలూన్ ఓపెన్ అయి సురక్షితంగా బయటపడేందుకు వీలుగా రూపొందించారు. ఎయిర్ బెలూన్‌లోనే ఆక్సిజన్ ఉండటం వల్ల అందులో ప్రయాణించే వారికి ఎలాంటి ప్రాణహాని ఉండదు. దీనికి జీపీఎస్ అనుసంధానం ఉండటం వల్ల హెలీకాప్టర్ క్రాషెస్‌ను గుర్తించేందుకు సులువవుతుంది.

### మొక్కజొన్న వ్యర్థాలు, పేడ నుంచి బయో ఆయిల్..



మొక్కజొన్న వ్యర్థాలు, పేడ నుంచి బయో ఆయిల్ ఉత్పత్తి చేసే ఆవిష్కరణను నిజామాబాద్ విజయ హైస్కూల్ విద్యార్థులు విజిదేంద్రియ, శ్రీకర్‌లు తమ గైడ్ టీచర్ మధుతో కలసి ప్రదర్శించారు. మొక్కజొన్న వ్యర్థాలు పశువులు తినడం వల్ల అవి అనారోగ్యం బారిన పడతాయని.. వాటిని సక్రమంగా వినియోగిస్తే బయో ఆయిల్ తయారు చేయవచ్చని వీరి ఆవిష్కరణ నిరూపిస్తుంది. అలాగే పేడతో బయో గ్యాస్ తక్కువ వ్యయంతో చేసేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు.

### అంధుల కోసం స్మార్ట్ షూ..



అంధులు నడిచేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ నాగార్జున టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి నబయ్ తన గైడ్ భవానితో కలిసి స్మార్ట్ షూ ప్రదర్శించారు. షూ ముందు భాగంలో సెన్సార్లను ఏర్పాటుచేసి.. లోపల వైబ్రేషన్‌తో కూడిన అల్లారం మోగేలా రూపొందించాడు. గుంతలు, రాళ్లు, ఎదురుగా ఏమైనా వాహనాలు ఉన్నట్లయితే వైబ్రేషన్‌తో కూడిన విజిల్స్ వచ్చేలా రూపొందించారు.

## విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



స్మార్ట్ వీల్‌చైర్ గురించి తెలుసుకుంటున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని.. అది ఏ ప్రభుత్వమైనా చేయాల్సిందేనని.. అందులో తమ ప్రభుత్వం ముందుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులోని ఎస్‌వీకేఎంలో విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆవిష్కరణలు తనను ఎంతో అబ్బురపరిచాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించాలని, ఆ ఆలోచనల నుంచే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందించడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. వీటికి తోడు ప్రతి పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఉండాలన్నారు. గురుకులాలు, పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. తాను బాలికా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తానన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు సంస్కారాన్ని అందించాలని, మంచి సమాజానికి ఇవ్వాలన్న భావన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యనే కాదు సంస్కారవంతుడిని కావాలని, నా వంతు కృషి, నా బాధ్యత అన్న ఆలోచనలు పిల్లల్లో పెంపొందించాలన్నారు. ఎస్‌సీఆర్టీ, ఎస్‌సీఆర్టీల సంయుక్త ఆధ్వర్యంలో మండల, జిల్లాస్థాయి ప్రదర్శనలను ముగించుకుని విజయవంతంగా 836 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి తీసుకురావడంపై అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు జాతీయస్థాయిలో తప్పనిసరిగా గుర్తింపు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మరిన్ని వివరాలు 8లో ▸

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం


దామోదర్‌రెడ్డి(ఫైల్)

జడ్చర్ల: గ్రామానికి వెళ్తూ టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా ఓవ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. జడ్చర్ల మండలం చాకలిగడ్డ తండా సమీపంలో జరిగిన ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. వివరాలు.. నవాబ్‌పేట మండలం కారూర్‌కి లంకల దామోదర్ రెడ్డి(85) బైక్‌పై జడ్చర్ల వైపు నుంచి కారూర్‌కి వెళ్తున్నాడు. మార్గమధ్యలో టీ తాగేందుకు బైక్‌ను రహదారి పక్కన నిలిపి మరోవైపు ఉన్న హోటల్‌కు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్నాడు. గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వైపు వెళ్తూ అతడిని ఢీకొట్టింది. ప్రమాదంలో దామోదర్‌రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్: అనారోగ్య సమస్యలను తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మిడ్జిల్ మండలం మసిగొండ్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మసిగొండ్లపల్లికి చెందిన దొడ్ల యాదయ్య (50) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు, ఆస్పత్రుల చుట్టూ తిరిగినా తక్కువ కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య యాదమ్మ ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

### యువతిపై అత్యాచారం

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్న యువతిపై అత్యాచారం చేసినట్లు బాధితురాలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు సీఐ ఇజాజుద్దీన్ తెలిపారు. వివరాలు.. జిల్లాకేంద్రంలోని ఓప్రైవేట్ ఆస్పత్రిలో 20రోజుల కిందట ఓఅమ్మాయి రిసెప్షనిస్టుగా విధుల్లో చేరింది. డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా అదే ఆస్పత్రిలో పనిచేసే ఓయువకుడు తాగిన మైకంలో తనపై అత్యాచారం చేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. సదరు యువకుడిపై అత్యాచారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. ఆ ఆస్పత్రికి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఇజాజుద్దీన్ చేరుకుని అక్కడ పనిచేస్తున్న ఇతర సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఆ యువకుడిని రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు.

### గోదాంలో అగ్ని ప్రమాదం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో గల ఓ ప్రైవేటు గోదాములో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు శివకుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో శివకుమార్ ఏర్పాటు చేసుకున్న దుకాణంలో అల్యూమినియం, పీవీసీ పైపులు, ఫర్నిచర్ తదితర వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. దుకాణంలోని వస్తువులను నిల్వ ఉంచేందుకు గాను వెంకటేశ్వర కాలనీలో గోదాము ఏర్పాటు చేసుకున్నారు. అయితే గోదాములోని సామగ్రికి ప్రమాదవశాత్తు నిప్పంటించుకొని మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో పలు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. కాగా, గోదాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

### హోటల్ సాంబారులో బొద్దింక

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో తయారు చేసిన సాంబారులో బొద్దింక వచ్చిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న ఓ హోటల్‌లో కొల్లాపూర్ పట్టణానికి చెందిన శివ తన స్నేహితుడితో కలిసి భోజనం ఆర్డర్ చేశాడు. భోజనం చేస్తుండగా సాంబారు వేసుకోవడంతో అందులో బొద్దింక రావడంతో ఖంగుతిన్నాడు. వెంటనే హోటల్ యజమానిని ప్రశ్నించడంతో కస్టమర్‌పై దురుసుగా ప్రవర్తించాడు. ఘటనకు సంబంధించి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌ను వివరణ కోరగా.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని తెలిపారు.

### రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు ప్రాజెక్టులో మంగళవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,050, కుడి, ఎడమ కాల్వ ద్వారా 65 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

### మల్టీపర్పస్ డిస్పెన్సర్..



కరోనా లాంటి వైరస్‌ల బారిన విద్యార్థులు పడకుండా చేతులను శుభ్రం చేసుకునేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువుతండా పాఠశాల విద్యార్థిని నందిని తన గైడ్ టీచర్ డానియేల్‌తో కలిసి మల్టీపర్పస్ డిస్పెన్సర్ ఆవిష్కరించారు. తక్కువ ఖర్చుతో హ్యాండ్‌వాష్ ఉపయోగించే లోషన్లు వృథా కాకుండా సెన్సార్ ఆధారంగా అవసరం మేరకు లోషన్ విడుదలయ్యే విధంగా పరికరాన్ని రూపొందించారు. అలాగే ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు సైతం ఇదే పరికరం ఉపయోగించవచ్చు. దీనికి కేవలం రూ. 150 మాత్రమే ఖర్చయిందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో అమలుచేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

### మల్టీ పంక్షనల్ పవర్ సేవ్ మిషన్..



కరీంనగర్ జిల్లా పద్మానగర్ హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థి చెగువేర తన గైడ్ టీచర్ రాహుల్‌తో కలిసి వ్యవసాయ రంగంలో మల్టీ పంక్షనల్ పవర్‌సేవ్ మిషన్‌ను ఆవిష్కరించారు. తక్కువ ధరతో కూడిన ఎకో ఫ్రెండ్లీ మల్టీ పంక్షనల్ పోర్టబుల్ డిజైన్ కలిగి సోలార్ పవర్‌తో పనిచేస్తుంది. యంత్రంతో వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, భూసార పరీక్ష కేంద్రాలు, పరిశోధన కార్యకలాపాల కోసం మట్టి, ధాన్యాలను వేరు చేయడానికి ఉపయోగించవచ్చు. ఉద్యానశాఖ నర్సరీ బెడ్లలో అవసరమైన పరిమాణంలో గల ధాన్యాలను పొందేందుకు ఉపయోగించవచ్చు.

# అట్టహాసంగా..

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పోలేపల్లి ఎస్‌వీకేఎంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై ప్రదర్శనలను తిలకించారు. ఆవిష్కరణలతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులతో తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ప్రదర్శనను సందర్శించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాలు ఎలా నడపాలో విద్యార్థులు రిమోట్ కంట్రోల్ కార్లు నడిపి అవగాహన పెంచుకున్నారు. సభ ముగిసిన తరువాత విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కాగా, విద్యార్థులతో మంత్రి ముఖాముఖి కావడంతో సభ ఆలస్యమైంది. మధ్యాహ్నా భోజనం సమయం మించి పోవటంతో విద్యార్థులు కుర్చీల్లోంచి లేచి వెళ్తుండటంతో వేదికపై ఉన్న అతిథులు మాట్లాడక ముందే నేరుగా మంత్రి మైక్ అందుకుని ప్రసంగించారు. ఆలస్యం అయినందుకు మన్నించాలని కోరారు. ఆలస్యం కావడం వల్ల మంత్రి తన ప్రసంగాన్ని కేవలం 6.38 నిమిషాల్లోనే ముగించారు. ప్రారంభ కార్యక్రమానికి పట్టణంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకురావడంతో భోజనాల వద్ద కొంత ఇబ్బంది నెలకొంది. కలెక్టర్ విజయేందిర బోయి అక్కడే ఉండి పర్యవేక్షించారు. అందరికీ భోజనం వడ్డించేలా చర్యలు తీసుకున్నారు. ఆర్‌బీఎస్‌కే ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మపురి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి రాజనర్సింహకు రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు.

### ధ్వనితో విద్యుత్ ..



ఇన్‌స్పైర్ విభాగంలో ధ్వనితో విద్యుత్ తయారీ యంత్రాన్ని మేడ్చల్ జిల్లాకు చెందిన అశోక మెమోరియల్ చాణక్య హైస్కూల్ విద్యార్థిని కోమలి రూపొందించారు. ముఖ్యంగా ఫంక్షన్ హాళ్లలో ధ్వని అధికంగా ఉండటం వల్ల అక్కడ విద్యుత్ ఉత్పత్తిని తయారు చేయవచ్చని ప్రదర్శన ఆవిష్కరణలో వివరించారు.



### విద్యార్థులకు ప్రోత్సాహం: డైరెక్టర్ నర్సింహారెడ్డి

విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహద పడతాయని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి అన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలకు పేటెంట్ హక్కు కల్పించేందుకు కృషిచేస్తామని ప్రకటించారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు జిల్లాకు అవకాశం కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యజీవితంలో ఉపయోగపడే అద్భుత ఆవిష్కరణలు వైజ్ఞానిక ప్రదర్శనలో ఆవిష్కృతం చేస్తున్న విద్యార్థులను అభినందించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలు ఉండాలన్నారు.

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విద్యార్థులు చక్కటి ఆవిష్కరణలు రూపొందించారని ప్రశంసించారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సహజ వ్యవసాయం వంటి ప్రధాన అంశాలపై విద్యార్థులు ఆలోచనలకు పదునుపెట్టి ప్రయోగాలు రూపొందించారని అన్నారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అన్నట్లుగా కలలు కనాలని.. వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా క్యూర్‌కోడ్‌తో రూపొందించిన డిజిటల్ కాంటెంట్ ఉన్న పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో జడ్చర్ల, మక్తల్ ఎమ్మెల్యేలు స్వంత డబ్బులతో రూపొందించిన డిజిటల్ కాంటెంట్ పుస్తకాలను ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 33 జిల్లాల నుంచి ఇన్‌స్పైర్ 2023–24 విభాగంలో 301, 2024–25 రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన కింద 563 ప్రదర్శనలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌వీకేఎం ప్రతినిధులు భరత్ సంఘ్వి, గిరిజా మోహన్, ప్రిన్సిపాల్ ఎబినేజర్ పాల్గొన్నారు.

### యువత మత్తుకు దూరంగా ఉండాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న విజయ్‌కుమార్

తెలకపల్లి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రిటైర్డ్ డీఈఓ శివార్చక విజయ్‌కుమార్ అన్నారు. బాపు బాటలో సత్యశోధన పాదయాత్రలో భాగంగా మంగళవారం విజయ్‌కుమార్ తెలకపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యావంతులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంటుందని.. దేశం కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. స్వదేశీ వైద్యాన్ని ఆదరించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి పరుచుకోవాలని సూచించారు. ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కొమ్ము ఆనంద్, లక్ష్మణ్, భాస్కర్, బచ్చన్న, లక్ష్మారెడ్డి, బాలు, పాషా, బాలస్వామి, గెలువాచారి, ఫరీద్ పాల్గొన్నారు.

### పుట్టెడు దుఃఖంలోనూ కళ్లు దానం



ఆత్మకూర్: పుట్టెడు దుఃఖంలోనూ తన భర్త కళ్లను దానం చేసి మానవత్వం చాటుకుంది ఆత్మకూర్ మండలం మూలమల్లకు చెందిన జయమ్మ. వివరాల్లోకి వెళ్తే.. మూలమల్లకు చెందిన కబడ్డీ క్రీడాకారుడు విజయ్ సోమవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆస్పత్రి నిర్వాహకులు కళ్లను దానం చేయాలని.. ఇతరులకు చూపు వచ్చే అవకాశం ఉంటుందని మృతుడి భార్య జయమ్మను కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి తన భర్త కళ్లను దానం చేసింది. జయమ్మను వైద్యులు, స్థానికులు అభినందించారు.

# రక్తమోడిన రహదారి


ఘటనా స్థలంలో క్షతగాత్రులు


కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్

- ఎన్‌హెచ్–167పై కారు, టిప్పర్ ఢీ
- ఇద్దరి దుర్మరణం.. మరో నలుగురికి తీవ్రగాయాలు
- దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ వద్ద ఘటన

మహబూబ్‌నగర్ క్రైం/దేవరకద్ర: దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ గ్రామ సమీపంలోని 167వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రాయచూర్ జిల్లా లింగసూగూర్‌కు చెందిన బస్వరాజు (55), జంగంమూర్తి (52), మల్లన్న, చిన్నయ్య స్వామి, మల్లికార్జున్, అమర్‌నాథ్ ఆదివారం యాదాద్రి జిల్లాలోని కొలాన్‌పాకకు వెళ్లారు. అక్కడి నుంచి కారులో మంగళవారం రాయచూర్‌కు బయల్దేరగా.. మార్గమధ్యంలోని పెద్ద గోప్లాపూర్ సమీపంలో రాయచూర్ వైపు నుంచి మహబూబ్‌నగర్ వైపు బూడిద లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగన్న.. పోలీసు సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీసి, అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యంలోనే బస్వరాజు, జంగంమూర్తి మృతి చెందారు. మల్లన్న, చిన్నయ్య స్వామి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

**గంటన్నరపాటు విలవిలలాడిన కారు డ్రైవర్..**

కారును టిప్పర్ వేగంగా ఢీకొట్టడంతో ముందు భాగం పూర్తిగా నుజ్జునజ్జయ్యింది. కారులోనే డ్రైవర్ ఇరుక్కుపోయి గంటన్నర పాటు విలవిలలాడాడు. పోలీసులు, స్థానికులు ఎంత ప్రయత్నించినా బయటికి తీసుకురాలేకపోయారు. చివరకు జేసీబీ ద్వారా అతడిని బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నల్లబెల్లం, సారా పట్టివేత


పట్టుబడిన నల్లబెల్లం, అల్లంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది

అచ్చంపేట: మండలంలోని హాజీపూర్ వద్ద మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు నల్లబెల్లం, నాటు సారా తరలిస్తున్న కారును పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ కృష్ణ వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి ఉప్పునుంతల మండలం దేవదారి కుంట తండాకు కారులో నల్లబెల్లం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. 31 బస్తాల్లో 630 కిలోల బెల్లంతో పాటు 50 కిలోల అల్లం, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 1.38 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నల్లబెల్లం, అల్లం, సారా తరలిస్తున్న శివపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ సతీష్, కానిస్టేబుల్స్ ఆంజనేయులు, బాల్‌రెడ్డి, నవీన్, బందీలాల్ ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ దుర్మరణం


శివనారాయణ (ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఆర్ఎంపీ మృతి చెందారు. ఎస్ఐ ఎం.వేణు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లాకేంద్రానికి చెందిన ముష్టి శివ నారాయణ(65)ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. మంగళవారం స్కూటీపై భూత్పూర్ వైపు నుంచి వనపర్తికి 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. కొమిరెడ్డిపల్లి శివారులో స్కూటీ వెనుక కర్నూలు వైపు వెళ్లే కర్ణాటకకు చెందిన లారీ(కేఏ06ఏఏ5556) వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివనారాయణ తల పగిలి తీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. ఇదిలా ఉండగా స్కూటీ లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయింది. దాన్ని లారీ కొంత దూరం అలాగే ఇడ్చుకెళ్లింది. తర్వాత డ్రైవర్ లారీని పక్కకు నిలిపి అక్కడి నుంచి పరారయ్యాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఎం.వేణు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కిడ్నాప్ కథ సుఖాంతం

**శాంతినగర్ పోలీసుల చొరవతో ఇంటికి చేరుకున్న బాధితుడు**


కిడ్నాపర్ల చెర నుంచి సురక్షితంగా బయటపడిన రమేష్‌బాబు

శాంతినగర్: డబ్బు కోసం ఓ వ్యక్తిని కొందరు కిడ్నాప్ చేయగా.. పోలీసుల చాకచక్యంతో అతడు క్షేమంగా ఇంటికి చేరాడు. కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌కు గురైన రమేష్ బాబు, అతడి భార్య సుభాషిని తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన కిరాణ వ్యాపారి మాలె రమేష్ బాబుకు సోమవారం ఓ ఫోన్‌కాల్ రావడంతో హుటాహుటిన హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడ అతడిని కొందరు కిడ్నాప్ చేసి ఓ అపార్ట్‌మెంట్‌కు తరలించి చిత్రహింసలకు గురిచేశారు. సాయంత్రం అతడి భార్య సభాషినికి ఫోన్ చేయించి రూ.10 లక్షలు వెంటనే పంపాలని.. వ్యాపారం కోసం అవసరం ఉందన్నారు. అయితే ఓ వ్యక్తి రూ.10 లక్షలు తెచ్చి ఇస్తాడని సూచించాడు. అయితే అనుమానం వచ్చిన బంధువులు.. సోమవారం రాత్రి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ సంతోష్‌కు వివరాలు వెల్లడించారు. రమేష్‌బాబు ఫోన్ నంబర్ ఆధారంగా సిగ్నల్‌ను ట్రేస్ చేసి హైదరాబాద్ నాగోలు సమీపంలోని బండ్లగూడ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నట్లు గుర్తించాడు. అర్ధరాత్రి ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు మరో ఇద్దరు వ్యక్తులతో కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. తెల్లవారు జామున అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లే సమయంలో మరోసారి ఫోన్ వచ్చింది. తాను హైదరాబాద్ నుంచి బయల్దేరి వస్తున్నానని.. అడ్డాకుల వద్ద వస్తున్నట్లు ఫోన్‌లో రమేష్‌బాబుతో మాట్లాడించారు. వారి మాటలను నమ్మకుండా నేరుగా అపార్ట్‌మెంట్‌కు చేరుకోగా.. ఇద్దరు కిడ్నాపర్లు అక్కడి నుంచి పరారయ్యారు. శాంతినగర్, కలుకుంట్లకు చెందిన మరో ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. తమను కిడ్నాప్ చేశారని బుకాయించారు ఇద్దరు. ఓ వక్తిపై చేయిచేసుకోగా.. ఇంటి తాళం ఇచ్చాడు. వెంటనే లోపలికి వెళ్లిన పోలీసులు రమేష్‌బాబును రక్షించారు. రమేష్ బాబుతో పాటు ఇద్దరు నిందితులను వెంటబెట్టుకుని శాంతినగర్ స్టేషన్‌కు తరలించారు. తప్పించుకున్న వారి వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నట్లు సమాచారం. ఈవిషయమై శాంతినగర్ సీఐ టాటా బాబును వివరణ కోరగా విచారణ పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

**రూ. లక్ష ఇస్తామని ఫోన్..**

బాధితుడు రమేష్ బాబుకు ఓ వ్యక్తి రూ. లక్ష ఇవ్వాల్సి ఉంది. కొన్ని నెలలుగా ఇవ్వని డబ్బులను ఇస్తానని.. చాలా మందికి అప్పులు కట్టాల్సి ఉన్నందున ఎవరికి చెప్పవద్దని నమ్మబలికినట్లు బాధితుడు తెలిపారు. తనకు రావాల్సిన డబ్బు వస్తుందని హైదరాబాద్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు.

# గంజాయి మొక్కలు స్వాధీనం


మిడ్జిల్‌లో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

మిడ్జిల్: మండల కేంద్రంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారంతో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి రూ. లక్ష విలువైన నాలుగు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి వివరాల మేరకు.. ఏపీలోని కృష్ణా జిల్లా నాగాయిలంక గ్రామానికి చెందిన నాయుడుస్ సుందరరావు (బాబ్జి) అనే యువకుడు కొన్నేళ్లుగా మిడ్జిల్‌లో వెల్డింగ్ షాప్ నిర్వహిస్తూ.. తన బంధువుల వద్ద ఉంటున్నాడు. గంజాయికి అలవాటు పడిన యువకుడు.. ఎవరికీ అనుమానం రాకుండా గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటిక సమీపంలో నాలుగు గంజాయి మొక్కలను పెంచాడు. సమాచారం అందుకున్న సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజ్, సిబ్బంది దాడులు నిర్వహించి, గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నాయుడుస్ సుందరరావును అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రోడ్డుపైకి మొసలి


గోవర్ధనగిరి గ్రామ కత్వ నుంచి రోడ్డుపైకి వచ్చిన మొసలి

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి సమీపంలోని ప్రధాన రహదారిపైకి మొసలి వస్తుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ అలుగు నుంచి ప్రవహిస్తున్న నీరు గోవర్ధనగిరి గ్రామ కత్వలోకి చేరుతుండటం.. కత్వలో నివాసం ఉంటున్న మొసళ్ల తరచూగా ప్రధాన రహదారిపైకి వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మొసళ్ల బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

### మార్కెట్‌లో నిర్మాణాలపై రగడ

- భవన నిర్మాణాలు చేపట్టవద్దని తాళం వేసిన ఎఫ్‌పీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికార పార్టీ నేతలు


రైతు మార్కెట్‌కు వేసిన తాళం

హన్వాడ: మండల కేంద్రంలోని రైతు మార్కెట్ స్థలంలో గ్రామ పంచాయతీ, గ్రంథాలయ భవనాలు నిర్మించేందుకు అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బీఆర్ఎస్‌కు చెందిన ఎఫ్‌పీఎస్ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ స్థలంలో ఇప్పటికే ఓపెన్ జిమ్ము, రైతు మార్కెట్, మటన్ మార్కెట్లు నిర్మించారని, అదనంగా పంచాయతీ భవనం, గ్రంథాలయాన్ని నిర్మించడం తగదని పేర్కొంటూ.. మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న మహిళలను బయటికి పంపించి తాళం వేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ, గ్రంథాలయ భవన నిర్మాణాలకు స్థలాన్ని చూపి స్వామని అధికారులు సూచించినట్లు వెల్లడించారు. సొసైటీ స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు మార్కెట్‌కు చేరుకొని ఎఫ్‌పీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల తీరును ఖండించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వేముల కృష్ణయ్య, కృష్ణయ్యయాదవ్, మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. రైతు మార్కెట్‌కు తాళం వేసిన విషయంపై స్థానిక ఎస్ఐ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గేటుకు వేసిన తాళాన్ని తీయించారు.